ప్లాట్ ఫారమ్మీద నేనూ, రైలు కదలబోయే ముందు నీ గాజుల్ని ముట్టుకొన్నా వణికే చేతులతో, నా చేయిమీద నీ ఎడంచేయి వేశావు. అప్పుడు నవ్వుతూ నీ వన్నమాటలు జన్మలో మరవలేను.

"మల్లాయ్, నీకు గాజులు తొడిగి, చీరె కడితె, నాకంటే బావుంటావ"ని. నన్నాడదానికింద జమ కట్టేశావా రోజు, నిజంగానే, ఇప్పుడు ఆడదానికంటే భీరువునై పోయా!

ఎందుకోగాని. ఇప్పుడే ఓ చిరునవ్వొచ్చింది. సుఖపడుతున్నవారిని చూచి, ఓర్వలేక, విరక్తితో నవ్వే నవ్వది. నేను నిన్నుచూచి ఓర్వలేనను కొంటావేమో, ఎప్పటికీకాదు, నీకు తెలీదూ, నీ మల్లాయ్ ఎటువంటివాడో.

ఏమిటా, మల్లాయ్ ఇలా రాశాడు మతి చెడిందని అనుకొంటావేమో- నీ ఊహలో నేను పిచ్చివాడి నయినా, ఆడదాని నయినా నాకు సంతోషమే ఒక్కొక్కసారి అనుకొనేవాడిని, నేను నువ్వై నీవే నేనైతే ఎలా ఉంటుందోనని. అప్పుడుగాని నీవు నా హృదయాన్ని అర్థం చేసుకోలేవు.

నేను నీపెళ్ళికి రాలేను, క్షమించు, ఓవేళ వచ్చినా ఆ నీ చూపుని ప్రస్తుత పరిస్థితిలో భరించలేను.

ఇందాక "జీవితంలోని ఒడుదుడుకుల్ని తట్టుకొని సుఖపడు—ఇదే నీ వివాహానికి కానుక." ఇం కేమేమో అన్నాను.

అది సరికాదు - నేనేమీ నీ కివ్వలేకపోయినా, ఆవేదనతోగూడిన ఓ పిచ్చి హృదయాన్ని నీ కంకితం చేస్తున్నా.

ఇదంతా నీకు దుఃఖం కలిగించి ఎందుకు రాశాడా అనిపించవచ్చు మనసులో కూడుకొన్న భావాలను అప్పులకు వెల్లడిస్తేనేగాని మనశ్శాంతి ఉండదు. నీకంటే నాకు ఎవ్వ రెవరున్నారు? భీరువుహృదయంతో, పిచ్చి ఆవేదనతో, అబలపౌరుషంతో హృదయాన్ని వెల్లడించిన నీ శ్రేయోభిలాషిని.

## ★ ఆడగుట్టు ★

### పెదపూడి ఆశీర్వాదం

"ఏమిటండీ పాతి పెడుతున్నారు" భర్తను అడిగింది అన్నపూర్ణ.

"అమ్మో! చెపితే నాకు ప్రాణంహానే" అని జవాబిచ్చాడు రంగారావు.

"చెప్పండి నాకు భయం వేస్తోంది" బ్రతిమిలాడింది అన్నపూర్ణ.

"సాహసకృత్యం. వింటే భయపడతావు, ఐనా - దగ్గరకురా!" అని అటూ ఇటూ చూసి "మరే.... ఒకడ్నిచంపి వాడి తల పాతి పెడ్తున్నాను" మట్టిలో పూర్తిగా పూడ్చేస్తూ భయాన్నభినయిస్తూ చెప్పాడు రంగారావు.

అన్నపూర్ణకు నోట మాట రాలేదు, కొయ్యబారిపోయింది.

రెండో రోజు అన్నపూర్ణ మనస్సు మనస్సులో లేదు. ఎంత వద్దనుకున్నా పుల్లమ్మతో చెప్పలేకుండా ఉండలేక పోయింది. పుల్లమ్మతో ఒట్టు వేయించుకుంది, తన భర్త ఎవర్నోచంపి తన పెరటిదొడ్లో పాతిపెట్టాడని పుల్లమ్మ చెవిలో ఊదేసింది. మూడోనాడు పుల్లమ్మ వెంకమ్మ కందించింది. సాయంకాలానికల్లా ఊరంతా ఊరంతా పొక్కి పోయింది. అన్నపూర్ణ మొగుడు ఎవర్నో హత్యచేశాడని ఊరంతా మోతమ్రోగిపోయింది. ఇంకేముంది కొంప మునిగిపోయింది గంపెడు చీకటిని నెత్తిన వేసుకొని యమభటుల్లా వచ్చిపడ్డారు పోలీసులు. అన్నపూర్ణ గజగజా వణికి పోతోంది. రంగారావు నిశ్చింతగా పత్రికాపఠనం చేస్తున్నాడు.

"ఏమయ్యా! ఎక్కడపాతిపెట్టావు శవాన్ని!"

"పెరటిదొడ్లో"

భటులంతా వెళ్ళి బైటకి తీశారు శవాన్ని. అంతా కడుపు చెక్కలయేటట్టు నవ్వేస్తున్నారు.

"ఏమిటయ్యా ఈ వింత"

"అబ్బే ఏంలేదు ఆడగుట్టు ఎంతవర కుంటుందో తెల్సుకుందామని బజార్లో కొనితెచ్చిన మేకతలకాయ పాతిపెట్టాను"

అన్నపూర్ణ చెడ్డసిగ్గు పడిపోయింది.